# లార్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్

పోస్ట్ బాక్స్ నెం. 2007, ఫైర్ ఫాక్స్. వి.ఏ. 22031.


## ఉప్పు (salt) (part 1 of 2)


జాయిసీ మోరిస్ By Joyce Morris 18/02/2007


ఈ దినాలలో దేవుడు ఏమి చేయుచున్నాడో దానిని బట్టి నేను ఆయనకు కృతజ్ఞతలు తెలియ చేసుకుంటున్నాను. ఆయన కదలాడే విధానము ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. నేను మీతో కొన్ని విషయాలను పంచుకోవాలని ఆశిస్తున్నాను. అవి మీకు అనుగుణంగా, మీకు సవాలుగా విశేషజ్ఞానాన్ని ఇచ్చేవిగా ఉండవచ్చు. మీరు ఇంతకుముందు ఎన్నడూ చూచియుండక పోవచ్చు.

ఒక రోజు ప్రభువు 16 సంవత్సరాల వయస్సు గలిగిన అబ్బాయిని మా దగ్గరకు తీసుకు వచ్చి షుమారు 2 గంటలపాటు అతనికి పరిచర్య చేయాడానికి సహాయం చేశాడు. ఆ సమయంలో ఎందుకు అతడు అంత భారముగా ఉన్నాడో మాకు అర్ధం కాలేదు.

ఎందుకు అతడు అంత భారముగా ఉన్నాడు అనే విషయాన్ని తరువాత దేవుడు మాకు చూపించాడు. ఎందుకనగా ఎవరైతే డ్రగ్స్ కి బానిస అయిపోయారో, ఈలోకంతో మిళితమైపోయి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారో అలాంటి యువతరం కొరకైన భారాన్ని దేవుడు మామీద ఉంచాడు. యువతరము పాడైపోవడమనే విషయము పట్టణాలలోను, నగరాలలోను, ప్రపంచమంతా కూడా జరుగుతున్న విషయము. యేమి జరుగుతుంది అనే విషయమై మరి ఎక్కువ అవగాహనను దేవుడు మాకు కలిగించి, మా ఆత్మలను వాషింగ్టన్ డి.సి, మరియు బాల్టిమోర్ కు తీసుకువెళ్ళి ఆ ప్రదేశాలలో మా ద్వారా ఆయన పరిచర్య చేశాడు. ఆయన ఈ పని చేస్తుండగా దేవుడు ఈ విధంగా చెప్పడం మేము విన్నాము. అదేమనగా ''చీకటిరాజ్యమును గూర్చి ఆయన తెలియ చేస్తున్నాడు. ఈ చీకటి రాజ్యము పాఠశాలల్లోను, వీధులలోను ఉన్న పిల్లల మనసుల్లోనికి చాలా త్వరితముగా వ్యాపిస్తూఉంది. డ్రగ్స్, సంగీతము వారి మనసులను ఆక్రమించుకొంటున్నాయి. ఈ చీకటి రాజ్యము రాబోయే తరాన్ని నాశనం చెయ్యడానికి ప్రయత్నిస్తుంది. ఇప్పటికే మన పిల్లలలో, మన మనవలు, మనవరాళ్ళల్లో జరుగుతూ ఉంది.

దేవుడు చాలా స్పష్టంగా మాట్లాడుతూ ఉన్నాడు అదేమనగా జనములను పూర్వపు స్థితికి తీసుకు రావాలని ఆయన ఆశిస్తున్నాడు. దేవుని బిడ్డలు క్రీస్తులో తమ స్థానంలో నిలువబడి అదే స్థానములోనికి జనములను తీసుకురావలసిన సమయం ఇదే అని ప్రభువు చెప్పుచున్నాడు. ఆదిలో ఏ విధంగా మానవునికి అన్నిటి మీద అధికారము ఇచ్చియున్నాడో అదేవిధంగా ఈ పరిస్థితులన్నిటి మీద ఆయన బిడ్డలకు అధికారం ఇవ్వబడింది. ఆదికాండము 1:26 ఈ విధంగా చెప్తుంది. **" దేవుడు- మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము, వారు సముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమి మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురు గాకనియు పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను, దేవుని స్వరూపమందు వాని సృజించెను, స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను.**

**దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమి మీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను.''** దేవుడు సముద్రము మీద సముద్రపు చేపల మీద ఆదాముకు అధికారము ఇచ్చాడు. మంచిది, ''సముద్రము'' ''మానవజాతి'' కి సాదృశ్యముగా ఉంది. దేవుడు ఆదాముకు సృష్టి అంతటిమీద అధికారము ఇచ్చాడు.( పాపము చేయకముందు)

ఇప్పుడు ప్రభువు తన యందు విశ్వాసముంచిన తన బిడ్డలను తిరిగి అదే అధికారములోనికి తీసుకు వస్తున్నాడు. క్రీస్తు పోలికలో లేని ప్రతి విషయాన్ని తొలగించడానికి ఎవరైతే ఆయనను అనుమతిస్తారో అలాంటివారికి ప్రభువు ఈ అధికారాన్ని తిరిగి ఇస్తాడు ఎందుకనగా శరీర సంబంధులు దేవుని అధికారాన్ని పొందుకోలేరు, ఎన్నటికి పొందలేరు.

ఎవరైతే క్రీస్తుతో ఐఖ్యమై క్రీస్తు మనసును అనుమతిస్తారో అలాంటి వారి ద్వారా ఇప్పుడే ఆయన పరిచర్య జరిగించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:7 ఈ విధంగా చెప్తుంది, **''క్రీస్తు యేసునందు మనలను ఆయనతో కూడా లేపి, పరలో కమందు ఆయనతో కూడా కూర్చుండబెట్టెను.''** ప్రకటన గ్రంథం 3:12 ఈ విధంగా చెప్తుంది, '' **జయించువానిని నా దేవుని ఆలయములో ఒక స్థంభముగా చేసెదను.** ఈ వచనాలలో క్రీస్తు చెప్పుచున్నది ఏమనగా ఆయనతో పాటు పరలోకంలో కూర్చోవడానికి, ఆయనతో పాటు పరిపాలించడానికి ఆయన మనకు అనుమతిస్తాడు. దీని అర్ధము - నీలోను, నీద్వారాను పరిపాలించేది యేసుక్రీస్తు మాత్రమే. క్రీస్తు నీలో ఉన్నప్పుడు మాత్రమే నీవు ఆ అధికారమును మరల పొందుకోగలవు. ఆ అధికారమును నీవు తిరిగి పొందుకోవడం అనేది దేవుడు నీ కిచ్చే వారసత్వం. కాబట్టి మన మార్గాలను ఆటంకపరచే చీకటి రాజ్యాన్ని మనలో అనుమతించకుండా దేవునిలో మనకున్న స్థానాన్ని మనం తీసుకోవాలి. దేవుడు మన యెడల ఆయన కలిగియున్న ఉద్దేశ్యాన్ని, ఆయన ప్రణాళికను మనముందు ఉంచుతున్నాడు, దానిమీద మనం దృష్టి నిలపాలి.

గత రెండు వారాలలో దేవుడు నాకు తెలియచేసిన ఆయన వాక్యాన్ని మీతో పంచుకోవలసిన అవసరత ఉంది. యెహెజ్కేలు దర్శనములోని జీవ నదిని ఆయన నాకు చూపిస్తూ ఉన్నాడు. యెహెజ్కేలు 47: 1-5 ఈ విధంగా చెప్తుంది. **'' అతడు మందిరపు గుమ్మమునకు నన్ను తోడుకొని వచ్చెను; మందిరము తూర్పు ముఖముగా ఉండెను, నేను చూడగా మందిరపు గడప క్రిందనుండి నీళ్ళు ఉబికి తూర్పుగా పారుచుండెను. ఆ నీళ్ళు బలిపీఠమునకు దక్షిణముగా మందిరపు కుడిప్రక్కను క్రిందనుండి పారుచుండెను. పిమ్మట ఆయన ఉత్తరపు గుమ్మము మార్గముగా నన్ను నడిపించి చుట్టు త్రిప్పి తూర్పునకు పోవు దారిని బయటి గుమ్మమునకు తోడుకొని వచ్చెను. నేను చూడగా అచ్చట గుమ్మపు కుడి ప్రక్కను నీళ్ళు ఉబికి పారుచుండెను. ఆ మనుష్యుడు కొలనూలు చేత పట్టుకొని తూర్పు మార్గమున బయలు వెళ్ళి వెయ్యి మూరలు కొలిచి నీళ్ళగుండా నన్ను నడిపింపగా నీళ్ళు చీలమండ లోతుండెను. ఆయన మరి వెయ్యి మూరలు కొలిచి నీళ్ళ గుండ నన్ను నడిపింపగా నీళ్ళు మోకాళ్ళ లోతుండెను, ఇంక ఆయన వెయ్యి మూరలు కొలిచి నీళ్ళ గుండ నన్ను నడిపింపగా నీళ్ళు మొల లోతుండెను. ఆయన ఇంకను వెయ్యి మూరలు కొలవగా నీళ్ళు మిక్కిలి లోతై నేను దాటలేనంత నది కనబడెను, దాటవీలు లేకుండ ఈదవలసినంత**

**నీరుగల నదియాయెను.''**

యెహెజ్కేలు దేవుని మందిరము నుండి నీళ్ళు రావడం చూస్తున్నాడు. ఆ నీళ్ళు మొదట పాదముల వరకు, తరువాత మోకాళ్ళ వరకు కొలవబడి, క్రమంగా అతడు దాటలేనంత నదిగా మారడం అతడు చూస్తున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా దేవుని వాక్యాన్ని వారి జీవితాలలో అనుమతించి, వారి ఆత్మీయ స్థితిని కొలుచుకొనే వారిని గూర్చిన దర్శనాన్ని యెహెజ్కేలు చూస్తున్నాడు. వారి జీవితాలు కొలవ బడుతున్నాయి, వారు దేవుని వాక్యము ద్వారా ఆయన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తు స్వారూప్యం లోనికి మహిమనుండి అధిక మహిమకు మార్చ బడుతున్నారు. 2 వ కొరింథీయులకు 3: 18 ఈ విధంగా చెప్తుంది "**మనమందరము మునుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింవ చేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మ చేత ఆ పోలిక గానే మార్చబడుచున్నాము''.**

దేవుని వాక్యము నీలో మార్పు తీసుకు వస్తుంది. క్రీస్తు మనసు ద్వారా నీవు పనిచేయ గలుగు నట్లు దేవుడు నిన్ను మారుస్తాడు.

యెహెజ్కేలు 47 వ అధ్యాయాన్ని కొనసాగిస్తే, 6నుండి 8 వ వచనము వరకు ఈ విధంగా ఉంది. **అప్పుడాయన నాతో ఇట్లనెను- నరపుత్రుడా, నీవు చూచితివి గదా అని చెప్పి నన్ను మరల నది యొద్దరికి తీసుకుని వచ్చెను. నేను తిరిగి రాగా నదీ తీరమున ఇరుప్రక్కల చెట్లు విస్తారముగా కనబడెను. అప్పుడాయన నాతో ఇట్లనెను- ఈ నీళ్ళు ఉబికి తూర్పుగా నున్న ప్రదేశమునకు పారి అరబాలోనికి దిగి సముద్రములో పడును, అప్పుడు సముద్రపు నీళ్ళు మంచినీళ్ళగును''.** మనము దేవుని ఆత్మలో ఉన్నప్పుడు ఈ నది మనలో నుండి పారుతుంది. తరువాత 9, 10 వచనాలు ఈ విధంగా చెప్తున్నాయి. **"వడిగా పారు ఈ నది వచ్చు చోట్లనెల్ల జలచరములన్నియు బ్రతుకును. ఈ నీళ్ళు అక్కడికి వచ్చుటవలన ఆ నీరు మంచినీళ్ళగును గనుక చేపలు బహు విస్తారములగును; ఈ నది ఎక్కడికి పారునో అక్కడ సమస్తమును బ్రతుకును. మరియు దాని యొద్ద ఏన్గెది పట్టణము మొదలుకొని ఏనెగ్లాయీము పట్టణము వరకును చేపలు పట్టువారు దాని ప్రక్కల నిలిచి వలలు వేయుదురు; మహా సముద్రములో నున్నట్లు సకల జాతి చేపలును దానియందు బహు విస్తారముగా నుండును.''** ఈ నది మనలోనుండి బయటకు వచ్చి విస్తారమైన చేపలు ఉండే సముద్రములోనికి పారుతుంది. సముద్రము మానవజాతికి సాదృశ్యంగా ఉంది- అనగా అన్ని దేశాలవారు, అన్ని జాతులవారు. ఇక్కడ వాక్యము చెప్తుంది- చేపలు పట్టేవారు తమ వలలు వేస్తారు. వారు వేస్తున్న ప్రతి వల కూడా దేవుని రాజ్యమును గూర్చిన వర్తమానము. వారు ఆ మహా సముద్రములోనుండి విస్తారమైన చేపలు పడతారు. మత్తయి 4:19లో యేసు ఈ విధముగా చెప్పుచున్నాడు, **ఆయన- నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేతును అని వారితో చెప్పెను''.**

ఈ జీవ నది అనగా క్రీస్తు మనసును కలిగియున్న ప్రజల గుంపు. దీనిని గూర్చి యెహెజ్కేలు 47 వ అధ్యాయము మరియు ప్రకటన గ్రంథము 22 వ అధ్యాయములో కూడా చూడవచ్చు. ప్రకటన 22: 1-2 వరకు ఈ విధంగా ఉంది. "**మరియు స్ఫటికము వలె మెరయునట్టి జీవజలముల నది దేవుని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనమునొద్ద నుండి ఆ పట్టణపు రాజవీధి మధ్యను ప్రవహించుట ఆ దూత నాకు చూపెను. ఆ నదియొక్క ఈవలను ఆవలను జీవ వృక్షముండెను; అది నెలనెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును. ఆ వృక్షము యొక్క**

**ఆకులు జనములను స్వస్థ పరచుటకై వినియోగించును.''** ఈ వాక్యము స్వచ్ఛమైన నదిని గూర్చి మాట్లాడుతుంది. ఈ స్వచ్ఛమైన నది దేవుని సింహాసనము నుండి వస్తుంది. ఇదే క్రీస్తు మనసు. క్రీస్తు మనసును ప్రతిబింబించే ప్రజలే ఈ జీవనది. ఈ నదికి ఇరువైపుల చెట్లు ఉన్నాయి.

యెహెజ్కేలు 47: 12 ఈ విధంగా చెప్తుంది, **" నదీతీరమున ఇరుప్రక్కల ఆహారమిచ్చు సకలజాతి వృక్షములు పెరుగును, వాటి ఆకులు వాడిపోవు, వాటి కాయలు ఎప్పటికిని రాలవు. ఈ నది నీరు పరిశుద్ధ స్థలములోనుండి పారుచున్నది గనుక ఆ చెట్లు నెల నెలకు కాయలు కాయును, వాటి పండ్లు ఆహారమునకును వాటి ఆకులు ఔషదమునకును వినియోగించును.''** మరియు ప్రకటన గ్రంధము 22:2 లో **''ఆ నదియొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను; అది నెల నెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును. ఆ వృక్షము యొక్క ఆకులు జనములను స్వస్థపరచుటకై విని యోగించును''.** వాక్యము చెప్తుంది, ఆ చెట్లు ఆకులు జనములను స్వస్థపరుస్తాయి, వాటి పండ్లు ఆహారముగా ఉపయోగపడతాయి. యెహెజ్కేలు 47:13 లో పన్నెండు గోత్రములను గురించి చెప్పబడింది( పన్నెండు అనగా దేవుని ప్రభుత్వమునకు గుర్తు). ఇక్కడ చెట్లు పండ్లు కాస్తున్నాయి, వాటి ఆకులు జనములకు స్వస్థత చేకూ రుస్తున్నాయి.

యెహెజ్కేలు 47:11 వ వచనము దగ్గర నేను ఆగిపోయాను ఎందుకంటే దేవుడు నాకు ఏమి చెప్తున్నాడో నేను అర్ధం చేసుకోలేక పోయాను. మరి ఎక్కువ విషయాల కొరకు ఒక్క నిముషము వెనక్కి వెళ్ళడానికి ఆశిస్తున్నాను. యెహెజ్కేలు 47:11 లో ఈ విధంగా ఉంది. **" అయితే ఆ సముద్రపు బురద స్థలములును ఊబి స్థలములును ఉప్పుగలవై యుండి బాగుకాక యుండును''.**

ఈమధ్య మేము ఆత్మతో నింపబడినప్పుడు దేవుడు కొన్ని ఊబి స్థలాలకు తీసుకువెళ్ళాడు, అక్కడ మేము కొన్ని మొసళ్ళను చూశాము. కొన్నిసార్లు దేవుడు కొన్ని గుర్తుల ద్వారా ఆయన చెప్పాలనుకున్న విషయాలను చెప్తూ ఉంటాడు. మొదట ఆయన ఏమి చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడో మాకు అర్ధం కాలేదు కాని తరువాత ప్రభువు "లెవియాథాన్''( సముద్రములో ఉండే భయంకమైన జంతువు)అని మాట్లాడటం మేము విన్నాము. ఆయన మాతో ఏమి చెప్తున్నాడో మేము అర్ధం చేసుకోవడానికి మా ఆత్మలు తొందరపడ్డాయి. ఇది శరీర సంబంధి యొక్క స్వభావానికి గుర్తుగా ఉంది. "లెవియాథాన్'' అనేది భయంకరమైన సర్పము. శరీర సంబంధి యొక్క స్వభావము ఈ సర్పము లాంటిది, ఎందుకనగా శరీర సంబంధి దేవునికి విరోధి. యేసుక్రీస్తు కూడా శాస్త్రులను పరిసయ్యులను సర్పసంతానమా అని పిలవడం జరిగింది.

యెహెజ్కేలు గ్రంధంలో చెప్పబడిన నది పారు చోటెల్ల జలచరములన్నియు బ్రతుకును. ఈ నీళ్ళు అక్కడికి వచ్చుట వలన ఆ నీరు మంచి నీళ్ళగును గనుక చేపలు బహు విస్తారములగును; ఈ నది యెక్కడికి పారునో అక్కడ సమస్తమును బ్రతుకును. ఎందుకనగా ఈ నది దేవుని సింహాసనము నుండి వచ్చే దేవుని ఆత్మ. ఇది ఎక్కడికి వెళ్ళినా ప్రతి వ్యక్తి యొక్క జీవితాన్ని మేల్కొలిపి వారిని జీవములోనికి నడిపిస్తుంది. ఈ నది" సత్యము''. ఈ సత్యము ప్రజలను మేల్కొలిపి స్వతంత్రులుగా చేస్తుంది. ఆ విధంగానే దేవుడు నిన్ను నన్ను మేల్కొలిపి యున్నాడు. దేవుని ఆత్మ ద్వారా సత్యము నీ యొద్దకు వచ్చినప్పుడెల్ల సత్యము నీ మనసును మేల్కొలుపుతుంది. ఈ సత్యము నీలో ఉన్న అబద్దాలను, మోసమును, నీ ఊహలను దహించివేసి నిన్ను స్వతంత్రునిగా చేస్తుంది! దేవుని సత్యము ఆయన వాక్యము ద్వారా, ఆయన ఆత్మ ద్వారా నీకు పరిచర్య చేసినప్పుడు నీలో ఈ విషయాలు జరుగుతాయి. వాక్యము చెప్తుంది, ఈ నది పారుచోటెల్ల విస్తారమైన

చేపలు బ్రతుకుతాయి. చేపలు పట్టు వారు దాని ప్రక్కల నిలిచి వలలు వేస్తారు. "వల" అనేది దేవుని రాజ్య సువార్త కు సాదృశ్యంగా అనగా మనుష్యలను దేవునికొరకు సంపాదించడానికి సాదృశ్యంగా ఉండడానికి కారణం ఏమిటి అంటే యేసుక్రీస్తు మత్తయి సువార్త 13:47 లో ఈ విధంగా చెప్పడం జరిగింది **"మరియు పరలోక రాజ్యము, సముద్రములో వేయబడి నానావిధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది."** ఈ వలలో నీవు నేను పట్టబడ్డాము.

నీవు దేవుని నుండి పడిపోయిన సమయాలు ఉండవచ్చు; కాని దేవుడు ఆయన వలను విసిరి మరొక వర్తమానము ద్వారా నిన్ను పట్టుకుని నీ హృదయాన్ని సరిచేసి ఆయనలో నిలువబెడతాడు. క్రమముగా యిర్మీయా గ్రంథంలో చెప్పబడిన చెట్టు వలె నీవు మారతావు. యిర్మీయా 17:8 **"వాడు జలములయొద్ద నాటబడిన చెట్టువలె ఉండును; అది కాలువల ఓరను దాని వేళ్ళు తన్నును; వెట్ట కలిగినను దానికి భయపడదు, దాని ఆకు పచ్చగా నుండును, వర్షములేని సంవత్సరమున చింతనొందదు కాపు మానదు".** క్రీస్తు అనే ఈ నది వలన నీ వేర్లు లోతుగా నాటబడతాయి. ఈ నది ప్రక్కనే నీవు ఉంటావు. ఈ నదినుండి నీవు కదిలించబడవు ఎందుకనగా ఈ నది ప్రక్కనే నీవు నాటబడ్డావు. నీ చెట్టును నీవు లోయలో నాటవద్దు, నీ వేరులు లోతైన ప్రదేశంలోనికి వెళ్ళి తుఫాను వచ్చినప్పటికి స్థిరంగా ఉండులాగున నది ప్రక్కనే నాటు. ఈ సృష్టి నుండి తుఫానులు వచ్చినప్పుడు ఎవరైతే ఈ నది ప్రక్కన నాటబడి యుండలేదో వారు స్థిరంగా నిలబడలేరు.

చాలా కాలం క్రితం నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నా యిల్లు సముద్రం ప్రక్కన ఉంది. నా యిల్లు సముద్రము ప్రక్కన కట్టబడి ఉంది, అయితే అకస్మాత్తుగా సముద్రము నుండి తుఫానులు వచ్చి నా యింటిని కొడుతున్నాయి, అయితే నేను ఏమి చూశానంటే నా యిల్లు చిన్న రబ్బరు వస్తువు మీద కట్టబడి ఉంది. అది తుఫాను వల్ల నాశనం కాలేదు, అటూ ఇటూ ఊగుతూ మరల దాని స్థానంలో స్థిరంగా ఉంది.

ప్రభువు చెప్తున్నాడు, ఈ యిల్లు ఇసుకమీద కట్టబడలేదు. ప్రభువు మీద ప్రభువు వాక్యం మీద కట్టబడింది అని ఆయన చెప్తున్నాడు! తుఫానులు వచ్చి దాని మీద కొట్టినా అది నాశనం చేయబడదు. దేవుని ఆత్మ ద్వారా దేవుని వాక్యము మీద కట్టబడకుండా ఇసుక మీద అనగా శరీర సంబంధమైన బోధమీద కట్టబడిన వ్యక్తి ఆపద్దినమందు నిలువబడలేడు. ఎఫెసీయులకు 6:13 ఈ విధంగా చెప్తుంది **"అందుచేత మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చిన వారై నిలువబడుటకును శక్తిమంతులగు నట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి".** ఆపద్దినము అనగా ప్రభువు దినము! దేవుడు అనేక స్థలాలలో అనేక బలమైన ఇళ్ళను( వ్యక్తులను) నిర్మిస్తూ ఉన్నాడు!

ఆయన ఎలా కడతాడు? నీ జీవితంలో అనేక రకాల తుఫానులు గుండా నీవు వెళ్ళవలసి ఉంది; ఆయన పూర్తి చేసే వరకు ఇవి వస్తానే ఉంటాయి. నీకు వచ్చే తుఫానులు నిన్ను నాశనం చేయడానికి కాదు, నిన్ను బలముగా తయారు చేసి నీ వేరులు ప్రభువులో లోతుగా నాటబడేటట్లు చేస్తాయి. నీ జీవితంలో నీవు ఏ ఏరియాలో బలహీన పడ్డావో ఆ ఏరియాలో కొంత పని జరగవలసి ఉంది. దేవుడు నీలో ఏర్పడిన బలహీనతలను దహించి వేస్తాడు.

నీ యిల్లు బండ మీద కట్టబడినప్పుడు ( క్రీస్తు అనే బండ) అది స్థిరంగా ఉంటుంది. క్రీస్తు మనసు అనే ఈ నది నీ నుండి ప్రవహించే స్థితికి దేవుడు నిన్ను మలచినప్పుడు నీవు నీ వలను సముద్రములో ( మానవజాతి అనే సముద్రము) వేయడానికి సిద్ధంగా ఉంటావు! ఈ సముద్రము అన్ని జాతులను సూచిస్తుంది. మేము

దేవుని ఆత్మతో నింపబడినప్పుడు దర్శనములో మేము చూసిన ఊబి స్థలములు మరియు మొసళ్ళు దగ్గరికి నేను తిరిగి వస్తున్నాను. ఆయన నాతో ఈ విధంగా చెప్పి యున్నాడు, వీరు వేరే ప్రజలు వీరు గురించి ఇప్పుడు నేను చెప్పడం లేదు. తరువాత ఆయన నన్ను యెహెజ్కేలు 47:11 వ వచనము చదవాలని చెప్పాడు. నేను ఆ లేఖనాలను తెరచి చదివినప్పుడు **''అయితే ఆ సముద్రపు బురదస్థలములును ఊబిస్థలములును ఉప్పుగలవై యుండి బాగుకాక యుండును''** నిజంగా ఈ వాక్యము దగ్గర నేను ఆగిపోయేటట్లు చేసింది. అదే వాక్యాన్ని నేను ఈ రోజు మీతో పంచుకోవాలని ఆశిస్తున్నాను. “ఉప్పు''!

ఈ రోజు దేవుని వాక్యము లో మీకు మంచి రుచిని, ఆనందాన్ని కలిగించి మీ ఆకలిని తీర్చబోతున్నాము! దేవుడు ఆయన ఏమి చేస్తున్నాడో అది మనము చూడడానికి మనం అనుమతించి మనం శ్రద్ధ కలిగి యుండాలని ఆయన కోరుతున్నాడు. పైన చెప్పబడిన ప్రజల విషయంలో ఆయన జోక్యం కలుగచేసుకోవలసిన సమయం ఇంకా ఉంది అందుకే ఆయన వారిని ఉప్పు ఉండే స్థలాలకు మారుస్తున్నాడు. ఆయన సమయం వచ్చే వరకు వారిని అక్కడ భద్రపరుస్తున్నాడు. దేవుడు నోవహు దినములలో వరద ద్వారా నాశనం చేయబడిన ప్రజలను యేసు (పునరుత్థానము తరువాత) పాతాళానికి దిగి వెళ్ళి వారికి సువార్తను అందించి వారిని విడుదల చేసే వరకు వారిని భద్రపరచి యుంచాడు! దేవుని వాక్యాన్ని (యేసు క్రీస్తును) స్వీకరించడానికి ఆయన కొంత సమయము వారిని ఉప్పులో ఉంచి శుభ్రపరచి వారి హృదయాలను మృదువైనవిగా చేసి వారిని విడుదల చేశాడు. 1 వ పేతురు 3:18-20 ఈ విధంగా ఉంది **''యేలయనగా మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు, ఆత్మ విషయములో బ్రతికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టు చుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటిద్వారా రక్షణపొందిరి''.** దేవుని వాక్యమును బట్టి చూస్తే ఉప్పు పవిత్రపరచడానికి ఉపయోగపడుతుంది. బురదస్థలములు, ఊబిస్థలములు లాంటి ప్రజలను దేవుడు ఉప్పుగలవిగా చేస్తున్నాడు. ఆయన సమయము వచ్చే వరకు వారిని స్వస్థపరచడు కాని వారిని శుద్ధి చేస్తాడు. ఈ నది వారి దగ్గరికి వెళుతుంది కాని వారిని స్వస్థపరచదు. వారు దేవునితో సమాధానపడి తిరిగి దేవుని దగ్గరకు వచ్చే వరకు ( చాలా సమయం పట్టవచ్చు) వారిని ఉప్పుగానే ఉంచుతాడు! ఎంత కృప కలిగిన దేవుని మనం కలిగి యున్నాము?

మరొక విషయము నేను మీతో చెప్పాలను కుంటున్నాను. సొదొమ గొమొఱ్ఱ కాలములో, దేవుడు ఆ ప్రజలను నాశనం చేస్తానని చెప్పినప్పుడు, అబ్రహాము లోతును మరియు నీతిమంతులైన వారిని నాశనం చెయ్యవద్దని దేవుని ప్రాధేయపడ్డాడు. తరువాత ఆదికాండము 19వ అధ్యాయము ఈ విధముగా చెప్తుంది, ఇద్దరు దేవుదూతలు సొదొమ వెళ్ళినప్పుడు లోతు వారిని చూచి నమస్కరించి తన ఇంటికి రమ్మని బ్రతిమాలుకున్నాడు. ఈ అధ్యాయములో కొన్ని వచనాల తరువాత వచ్చిన ఆ యిద్దరు దూతలు పురుషులు అని వాక్యము చెప్తుంది. వారు దేవుని మనుషులు. వారికి దూతలకు ఉండే రెక్కలు గాని ప్రకాశవంతమైన వెలుగు గాని లేవు. వారిద్దరు దేవుని మనుషులు, లోతుతో ముఖాముఖీగా మాట్లాడుటకు దేవుడు వారిని పంపించాడు. నీవు నివసించే

ఈ ప్రాంతమునుండి నీవు పారిపోవాలి, దేవుని మాటకు నీవు వెంటనే లోబడు అని చెప్పారు! ఆ యిద్దరు మనుష్యులు వారిని పట్టణము వెలుపలికి తీసుకుని వచ్చి లోతుకు ఒక పర్వతాన్ని చూపించి వెనుకకు తిరిగి చూడకుండా త్వరగా అక్కడికి వెళ్ళమని చెప్పారు. ఆదికాండము 19:15-17 "**తెల్లవారినప్పుడు ఆ దూతలు లోతును త్వరపెట్టి - లెమ్ము; ఈ ఊరి దోషశిక్షలో నశించిపోకుండ నీ భార్యను ఇక్కడనున్న నీ యిద్దరు కుమార్తెలను తీసికొని రమ్మని చెప్పిరి. అతడు తడవు చేసెను. అప్పుడు అతనిమీద యెహోవా కనికరపడుట వలన ఆ మనుష్యులు అతని చేతిని అతని భార్య చేతిని అతని యిద్దరు కమార్తెల చేతులను పట్టుకొని వెలుపలికి తీసికొని వచ్చి ఆ ఊరి బయటనుంచిరి. ఆ దూతలు వారిని వెలుపలికి తీసికొని వచ్చిన తరువాత ఆయన -నీ ప్రాణమును దక్కించుకొనునట్లు పారిపొమ్ము, నీ వెనుక చూడకుము. ఈ మైదానములో ఎక్కడను నిలువక నీవు నశించిపోకుండ ఆ పర్వతమునకు పారిపొమ్మని చెప్పగా**" "నీవు వెనుకకు తిరగవద్దు, అలా తిరిగిట్లయితే నీవు అగ్నిలో దహించబడతావు" అని దూత చెప్పడం జరిగింది. నేను ఇది చదువుతున్నప్పుడు దేవుడు నాతో మాట్లాడటం మొదలుపెట్టాడు. దేవుని రాజ్య సవార్తను విని దేవుని అంగీకరించిన వ్యక్తులు వారి జీవితాలను మార్చడానికి ఆయనకు అనుమతినివ్వకపోయినట్లయితే, వారు మరల వారి పాత జీవితానికి వెళ్ళిపోతారు అని ప్రభువు నాతో చెప్పాడు. వారు ఉప్పు స్థంభం లాగా మారిపోతారు. దేవుడు ఆయన సమయము వచ్చే వరకు వారిని భద్రపరుస్తాడు ఎందుకనగా ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2:10-11 వరకు ఈ విధంగా ఉంది "**అందునేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్న వారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసు క్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.**"

లోతు భార్య ఉప్పు స్థంభంగా మార్చబడిన విధముగానే సొదమ గొమొఱ్ఱలు కూడా అగ్ని చేత భద్రపరచబడెను అని దేవుడు నాతో మాట్లాడియున్నాడు.

"భద్రపరచడం" అనగా అర్థం ఏమిటి? మనకు తెలుసు ఉప్పు వస్తువులను భద్రపరచడానికి ఉపయోగిస్తారు అని. మా తల్లి గారు ఆహారాన్ని నిల్వచేసేటప్పుడు నేను జాగ్రత్తగా గమనిస్తూ ఉండేదాన్ని. పచ్చని చిక్కుడు గింజలను, ఇతర కాయగూరలను నిలువ చేసేటప్పుడు వాటికి ఉప్పు జతచేసేవారు. కొన్నిసార్లు అయితే పంచదారను చేర్చేవారు కాని ఎక్కువ శాతం ఆహారాన్ని నిల్వచేయడానికి ఉప్పును మాత్రమే ఉపయోగించేవారు. మా నాన్నగారు మాంసమును నిల్వ చేయుడానికి ఉప్పును ఉపయోగించేవారు. ఆ విధంగా చేయడం వలన మాంసము పాడవకుండా చాలా కాలము నిలువ ఉండేది.

"భద్రపరచడం" అనే మాట దగ్గరకు నేను తిరిగి వస్తాను. దీని అర్థము పాడవకుండా కాపాడటం; కొంతకాలము వరకు నిలువ ఉండేటట్లుగా చేయడం. కాబట్టి ఉప్పు వస్తువులను తాజాగా ఉంచుతుంది అంతే కాకుండా కొంతకాలం తరువాత ఆ వస్తువును ఉపయోగములో ఉండేటట్లు చేస్తుంది.

వెబ్‌స్టర్ డిక్షనరీ ఈ విధంగా చెప్తుంది, నాశనము నుండి తప్పించుట, చెడునుండి కాపాడుట, పైకెత్తుట, కుళ్లిపోకుండా కాపాడుట, అవినీతినుండి తప్పించుట, తరువాత ఉపయోగించుటకొరకై వేరుపరచుట,

వేరొక వ్యక్తి కొరకై భద్రముగా ఉంచుట. చాలా ఆసక్తికరంగా ఉంది! ఇందులో ఇంకా చాలా ఉన్నాయి!

ఈ నది నీ నుండి ప్రవహించడం మొదలు పెట్టినప్పుడు అది సముద్రములోనికి వెళుతుంది. అక్కడ విస్తారమైన చేపలు ఉంటాయి. అప్పుడు చేపలు పట్టేవారు తమ వలలు వేస్తారు. వలలు వేయడం అనగా దేవుని రాజ్య సువార్తను వెదజల్లడం. వారు తమ వలలు వేసి సముద్రములో నుండి విస్తారమైన చేపలు పడతారు. "సముద్రము" 'మానవ జాతికి' సాదృశ్యంగా ఉంది అని మనం చెప్పుకున్నాం. ప్రతి జాతి , ప్రతి తెగ వారు ఇందులో ఉంటారు.

ఈ "జీవ నది" క్రీస్తు మనసును కలిగిన ప్రజల సమూహము. యెహెజ్కేలు 47, ప్రకటన గ్రంధము 22 అధ్యాయాలు చదవండి. ప్రకటన గ్రంధము, స్పటికము వలె మెరయునట్టి జీవజల నది దేవుని సింహాసనమునొద్ద నుండి ప్రవహిస్తుంది అది క్రీస్తు మనసు అనే నది. ఈ నది క్రీస్తు మనసును కలిగిన ప్రజల సమూహము. **" ఆ నది యొక్క ఈవలను ఆవలను జీవ వృక్షముండెను...." "..... ఆ నదీ తీరమున కిరుప్రక్కల ఆహారమిచ్చు నకల జాతి వృక్షములు పెరుగును''** దీని అర్ధము ఏమిటి అనగా వారు (వృక్షము మరియు వృక్షములు) దృశ్యమైన మరియు అదృశ్యమైన రెండు విధాలుగా వారు పనిచేస్తున్నారు. ఆ చెట్లు అన్నియు నెల నెలకు కాయలు కాస్తాయి, ఆ చెట్ల ఆకులు జనములను స్వస్థపరచుటకు వాటి పండ్లు వారి ఆహారమునకు వినియోగించును అని వాక్యము చెప్తుంది. యెహెజ్కేలు 47:13 లో పండ్రెండు గోత్రములను గురించి చెప్పబడింది. 12 వ నంబరు దేవుని అధికారాన్ని సూచిస్తుంది.

దేవుడు నా మనసును త్వరపెట్టాడు అదేమిటనగా లోతు భార్య సొదొమ గొమొఱ్ఱ వైపు వెనక్కి తిరిగి చూచినప్పుడు ఆమె ఉప్పు స్థంభంగా మారిపోయింది. యూదా పత్రిక 1వ అధ్యాయము 5వ వచనము చూచి నట్లయితే ''**ఈ సంగతు లన్నియు మీరు ముందటనే యెరిగి యున్నను, నేను మీకు జ్ఞాపకము చేయ గోరుచున్న దేమనగా, ప్రభువు ఐగుప్తులోనుండి ప్రజలను రక్షించినను వారిలో నమ్మక పోయిన వారిని తరువాత నాశనము చేసెను"**

మోషే చెప్పిన విషయాన్ని ఫరోతో సహా ఫరో కుమారుడు, ఫరో సైన్యము నమ్మక పోవడం వలన దేవుడు వారిని నాశనం చేశాడు అని మనకు తెలుసు. యూదా 1:6 లో ఈ విధంగా ఉంది, **"మరియు తమ ప్రధానత్వమును నిలుపుకొనక, తమ నివాన స్థలమును విడిచిన దేవదూతలను, మహాదినమున జరుగు తీర్పువరకు కటిక చీకటిలో నిత్యపాశములతో ఆయన బంధించి భద్రము చేసెను.**

"భద్రపరచుట ''అనే మాటను జాగ్రత్తగా వినండి. వారందరిని భద్రము చేసెను ఎక్కడ అనగా **"మహా దినమున జరుగు తీర్పు వరకు కటిక చీకటిలో నిత్యపాశములతో బంధించి భద్రము చేసెను''.** ఆయనను నమ్మని ప్రతి ఒక్కరిని ఆయన భద్రము చేసాడు. వారిని ఎక్కడ భద్రము చేశాడు అంటే నరకములో. నరకము అనేది వ్యక్తులను శుద్ధి చేసే అగ్ని మరియు శుభ్రపరచే ఉప్పులాంటిది. అదే అగ్నిగుండము, అదే శుద్ధి చేసే స్థలము.

సమయము లేనందున దీనిని గురించి పూర్తి వివరణ ఇవ్వలేక పోతున్నాను, దీనిని గురించి ఇంకా తెలుసుకోవాలనుకుంటే మా దగ్గరనుండి కేసెట్ మీరు తీసుకోవచ్చును. నరకము అనేది నీ మనసులో నెమ్మది లేకుండా చేస్తుంది, బాధపెడుతుంది. దేవుని ఆత్మనుండి మనము తప్పిపోయినప్పుడెల్ల ఇలాంటి అనుభవము మనకు ఎదురౌతుంది. ఇదే నరకము. అయితే దేవుని సన్నిధిలో ఇది నిలువజాలదు.

ప్రజలు ఎదుర్కొనే నరకము యొక్క స్థాయిలు రకరాలుగా ఉంటాయి. అట్టడుగు స్థాయి

నరకము ఏది అనగా మనిషి తనకు తాను తెచ్చుకొనే దుస్థితి. అదేమిటో మీరే గెస్ చెయ్యండి. దేవుడు అతనిని అక్కడ భద్రపరుస్తాడు! సొదొమ గొమొఱ్ఱలు వాటి చుట్టుపట్లనున్న ప్రజలందరితో పాటు లోతు భార్యను కూడా అక్కడ భద్రపరచాడు. యూదా 1:7 చదివినట్లయితే "**ఆ ప్రకారముగానే సొదొమ గొమొఱ్ఱాలును వాటి చుట్టు పట్లనున్న పట్టణములును వీరివలెనే వ్యభిచారము చేయుచు, పరశరీరానుసారులైనందున నిత్యాగ్నిదండన అనుభవించుచు దృష్టాంతముగా ఉంచబడెను**". వారు "నిత్యాగ్ని" ని అనుభవిస్తూ ఉన్నారు దీని అర్థము వేరు వేరు కాలాల్లో అనగా వారి జీవిత కాలమంత. "భద్రపరచుట" అనగా పాడవకుండ కాపాడుట. ఇది మీకు ప్రేరేపణ కలిగించట్లేదా? దీని గురించి ఆలోచించండి. ఈ లోకానికి ఉప్పులాగా నీవు ఉండేటట్లుగా దేవుడు నిన్ను చేస్తున్నాడు!

ఒక విషయాన్ని నేను అర్థం చేసుకోలేకపోయాను. పాతనిబంధనలో దావీదు మరియు మరికొందరు యుద్ధానికి వెళ్ళిన ప్రతిసారి ఉప్పు లోయలో శత్రువులను చంపుటకు దేవుడు అనుమతిస్తాడు. 2వ సమూయేలు 8:13-15 "**దావీదు ఉప్పు లోయలో సిరియనులగు పదునెనిమిది వేలమందిని హతము చేసి తిరిగి రాగా అతని పేరు ప్రసిద్ధమాయెను. మరియు ఎదోము దేశమందు అతడు దండునుంచెను. ఎదోమీయులు దావీదునకు దాసులుకాగా ఎదోము దేశమంతట అతడు కావలి దండుంచెను; దావీదు ఎక్కడికి పోయినను యెహోవా అతనిని కాపాడుచుండెను. దావీదు ఇశ్రాయేలీయు లందరిమీద రాజై తన జనుల నందరిని నీతి న్యాయ ములనుబట్టి యేలుచుండెను**". 2వ దినవృత్తాంతములు 13:5 లో దేవుడు దావీదుతోను అతని సంతతితోను ఉప్పునిబంధన చేసినట్లుగా చూస్తాము. "**ఇశ్రాయేలు రాజ్యమును ఎల్లప్పుడును ఏలునట్లుగా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా దావీదుతోను అతని సంతతివారితోను భంగము కాజాలని నిబంధన చేసి దానిని వారికిచ్చెనని మీరు తెలిసికొందురు గదా**". "భంగము కాజాలని" నిబంధనతో దేవుడు దావీదుకు రాజ్యాన్ని ఇవ్వడానికి కారణమేమనగా దావీదు దేవుని కృప ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన కలిగినవాడు. ఉప్పులోయలో వేరు వేరు జాతుల వారిని చంపడం అనేది ఆయన కృపచేత వారిని అక్కడ భద్రపరుస్తున్నాడని దావీదు అర్థం చేసుకున్నాడు. ఆ విధమైన అవగాహన వలనే 89వ కీర్తనలో దావీదు ఈ విధంగా వ్రాస్తున్నాడు. కీర్తన 89:1-4 "**యెహోవాయొక్క కృపాతిశయమును నిత్యము నేను కీర్తించెదను తరతరములకు నీ విశ్వాస్యతను నా నోటితో తెలియ జేసెదను. -కృప నిత్యము స్థాపింప బడుననియు ఆకాశమందే నీ విశ్వాస్యతను స్థిరపరచు కొందువనియు నేనను కొను చున్నాను. -నేను ఏర్పరచు కొనినవానితో నిబంధన చేసి యున్నాను నిత్యము నీ సంతానమును స్థిరపరచెదను తరతరములకు నీ సింహాసనమును**(కృపా సింహాసనము) **స్థాపించెదనని చెప్పి నా సేవకుడైన దావీదుతో ప్రమాణము చేసియున్నాను. సెలా**"

"మృత సముద్రాన్ని" "ఉప్పు సముద్రము "అని కూడా పిలుస్తారని నేను తెలుసుకున్నాను. ఎందుకంటే ఈ సముద్రము యొక్క నీరు 31.5% ఉప్పును కలిగి మహా సముద్రం లో ఉండే ఉప్పు కంటె 8.6% ఎక్కువ ఉప్పును కలిగియుంటుంది. ఈ సముద్రము యొక్క చుట్టు ప్రక్కల ప్రాంతమును ప్రపంచంలో కెల్ల అట్టడుగు( మెట్టభూమి) ప్రాంతంగా పిలుస్తారు. నా ఆలోచనను విస్తృత పరచమని దేవుని అడిగాను. ఉప్పులోయలో యుద్ధంలో చంపబడినవారు" భద్రపరచబడి" యున్నారు.

దేవుడు ఒకరోజు నాతో మాట్లాడుతూ ఈ విధంగా అన్నాడు, జాయిసీ, ''సహజమైన వాటిలో వాటిద్వారా నేను మాట్లాడతాను! మహాసముద్రంలో ఉన్న ప్రతి చేప దాని సైజులోను, ఆకారములోను, రంగులోను వేరు వేరు రీతులుగా ఉంటాయని నీకు తెలియదా? ఆ విధంగానే ఈ ప్రపంచంలోని ప్రజల ప్రవర్తన, చూపు, రంగు, ఆకారము, సైజు, జాతి మొదలగునవి వేరు వేరుగా ఉన్నాయి. కాని మహా సముద్రంలో ఏమి ఉంటుందో గెస్ చెయ్యి జాయిసీ? ఉప్పు'' భూమి పునాది వేయకముందే భూమి యందును పరలోకమందును దృశ్యమైన అదృశ్యమైన ప్రతిదానిని దేవునితో సమాధానపరచే దేవుని కృప ప్రణాళికను ఇది సూచిస్తుంది.

కాబట్టి దేవుడు మనకు కొన్ని విషయాలనుగురించి తెలియు చేస్తున్నప్పుడు ఈ సృష్టిలో ఉన్న కొన్ని సహజ వస్తువులను చూపిస్తుంటాడు. ఆయన గొప్పతనాన్ని మనం అర్థం చేసుకోవడానికి ఆయన వాటిని ఉపయోగిస్తాడు! ఎంత భయంక రమైన అద్భుతమైన దేవుడు ఆయన! ఆయన ప్రేమ మరియు ఆయన కృప ఎంత అద్భుతము! మొదటిగా ఆయన మనలను ''ఉప్పు''గా చేస్తున్నాడు.

దేవుడు తన వాక్యము ద్వారా సత్యాలను నాకు నీకు బయలుపరచి మనలను ఆయన వాక్యము లో బలపరచి భద్రపరుస్తున్నాడు.

పాతనిబంధనలో దేవునికి బలి అర్పణ చేసేముందు యాజకుడు బలి ఇచ్చే వస్తువుల మీద ఉప్పును చల్లడం చూస్తాం. నిజానికి మనం దేవుని ఆత్మతో నింపబడి క్రీస్తు మనసు కలిగి ప్రజలకు పరిచర్య చేస్తున్నప్పుడెల్ల వారిమీద వాక్యమనే ఉప్పును చల్లి వారిని తండ్రియైన దేవునికి వారిని బలిగా అర్పిస్తున్నాము. లేవీ గోత్రానికి చెందిన యాజకుని కంటె నీవు ఉన్నతమైన యాజకుడవు. మెల్కీసెదెకు క్రమము తరువాత ప్రధానయాజకుడైన దేవుని చేత నీవు పిలువబడ్డావు. ఈ యాజకత్వము నిరంతరము నిలిచేది. క్రీస్తులో ఉన్న మనలను ఆయన ఏ సమయములోనైన ఎక్కడికైనా తీసుకు వెళ్ళగలడు, బంధింపబడినవారిని విడిపించగలడు. దేవుని ఆత్మకు ఒక ప్రత్యేకమైన సమయము అంటూ ఏమీలేదు.

“ఉప్పు'' ఔషదంగా కూడా వాడతారు. నా చిన్నతనంలో నాకు కడుపులో సమస్య వచ్చినప్పుడు మా అమ్మ నాకు ఎపిసమ్ ఉప్పు ఇచ్చేది. ఉప్పు ఆరోగ్యానికి మంచిది.

2 వ రాజులు 2 వ అధ్యాయంలో ఎలీషాను గురించి మీకు గుర్తుందా? అక్కడ నీరు త్రాగడానికి ఉపయోగకరంగా లేదు. అయితే ఎలీషా కొంత ఉప్పు తీసుకురమ్మని చెప్పి దానిని ఆ నీటిలో వేసి అది బాగుపడునట్లు దేవుని మాటను పలికాడు. అదేమనగా యెహోవా సెలవిచ్చునది ఏమనగా- ఈ నీటిని నేను బాగు చేసియున్నాను గనుక ఇక దీని వలన మరణము కలుగకపోవును. కొన్నిసార్లు మనము దేవుని ఆత్మలో ఉన్నప్పుడు కొంతమంది అధికారుల విషయంలో దేవుడు జోక్యం చేసుకుని వారికి బుద్ధి చెప్పి వారిని సరిచేస్తుంటాడు. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:12 ఈవిధంగా చెప్తుంది, “ **యేలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారుల తోను, ప్రస్తుత అంధకారనం బంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహముల తోను పోరాడుచున్నాము.''** దృశ్యమైన రాజ్యంలో వారు ప్రభువులుగా ఉన్నారు. వారు ఈ లోక సంబంధమైన మనసుతో దేవునికి అవిధేయత చూపే ఆత్మలు. వారి శరీర సంబంధమైన మనసును నగరాలను, దేశాలను వారి స్వాధీనములోనికి తెచ్చుకోవడానికి ఉపయోగిస్తున్నారు. మనము దేవుని ఆత్మతో నింపబడినప్పుడు దేవుడు అలాంటి వారికి బుద్ధి చెప్పి వారిని సరిచేస్తూ ఉన్నాడు. ఆ విధంగా చేయడం ద్వారా కొంతమంది విడిపించబడుతున్నారు, కొంతమంది నయితే ఉప్పుగా మార్చి వారిని

భద్రపరుస్తున్నాడు. యెహెజ్కేలు 47:11 లో చెప్పినట్లుగా వారు బాగు చేయబడరు. దాని అర్థము ఏమిటి అనగా వారు దేవుని వాక్యాన్ని విని మార్చబడటానికి సిద్ధపడే వరకు వారిని శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా"నరకము"గుండా వారు ప్రయాణించు నట్లుగా ఆయన చేస్తున్నాడు.

ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2:10-11 వచనాలు ఈ విధంగా చెప్తున్నాయి. "**అందుచేతను పరలోకమందున్న వారిలో గాని భూమిమీద ఉన్న వారిలో గాని భూమి క్రింద ఉన్న వారిలో గాని, ప్రతి వాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును**" "భూమి క్రింద " ఉన్నవారు అనగా నరకములో ఉన్నవారు అని చెప్పవచ్చు. దేవుని రాజ్య సువార్తను వినే సమయం ఒకటి వారికి ఉంది కాని ఆ సమయం వరకు వారిని ఏమి భద్రపరుస్తుంది? ఉప్పు! మత్తయి 5:13 లో యేసుక్రీస్తు వారు ఇలా చెప్పారు, "**మీరు లోకమునకు ఉప్పయి ఉన్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యులచేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు.**" మన సంభాషణ కూడా ఉప్పు వేయబడినట్లు గా ఉండాలి.

ఎవరైన ఒక వ్యక్తి సమక్షంలో నీవు ఏమీ మాట్లాడకుండా ఉన్నప్పుడు, అకస్మాత్తుగా దేవుని ఆత్మ చేత నింపబడి వారి కొరకు ఈ వాక్యము నీవు చెప్పు అని దేవుడు నీతో మాట్లాడడం నీవు ఎప్పుడైనా గమనించావా? ఆ వాక్యము వారిని విడిపించబడేటట్లయినా చేస్తుంది లేదా వారిని ఒప్పించి ఇంకా ముందుకు మాట్లాడేటట్లయినా చేస్తుంది. ఆ సమయాల్లో నీవు వారిని వాక్యమనే ఉప్పుతో ప్రత్యేక పరుస్తున్నావు. ఆ వాక్యము వారిని ఒప్పించవచ్చు కాని వారు ఆ వాక్యాన్ని అనుసరించి ప్రవర్తించరు. అయినా ఏమీ పరవాలేదు, ఆ వాక్యము వారిని తరువాత సమయమువరకు భద్రపరుస్తుంది. ఒక సమయం ఉంది, ఆ సమయంలో దేవుడు కలుగజేసు కున్నప్పుడు నీ ద్వారా ఆ వాక్యము ఎప్పుడో చెప్పబడింది అనే విషయాన్ని వారు జ్ఞాపకం చేసుకుంటారు.

మార్కు సువార్త 9 వ అధ్యాయంలో యేసుక్రీస్తు వారు కన్ను ను ఉదాహరణగా తీసుకుని దేవుని రాజ్య సూత్రాలను మరియు ఆత్మలో నడవడం/ క్రీస్తు మనసు కలిగి నడుచుకోవడం గురించి విశదీకరించడం జరిగింది. మార్కు 9:47-50 "**నీ కన్ను నిన్ను అభ్యంతరపరచినయెడల దాని తీసి పారవేయుము; రెండు కన్నులు కలిగి నరకములో పడవేయబడుటకంటె ఒంటికన్ను గలవాడవై దేవుని రాజ్యములో ప్రవేశించుట మేలు. నరకమున వారి పురుగు చావదు; అగ్ని ఆరదు. ప్రతివానికి ఉప్పుసారము అగ్ని వలన కలుగును. ఉప్పు మంచిదేగాని ఉప్పు నిస్సారమైన యెడల దేనివలన మీరు దానికి సారము కలుగజేతురు? మీలో మీరు ఉప్పుసారము గలవారై యుండి యొకనితో ఒకరు సమాధానముగా ఉండుడని చెప్పెను.**" మరియు మత్తయి సువార్త 6:22-24 లో ఈ విధంగా ఉంది, "**దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండిన యెడల నీ దేహమంతయు వెలుగు మయమైయుండును. నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు చీకటిమయమై యుండును; నీలోనున్న వెలుగు చీకటియై యుండినయెడల ఆ చీకటి యెంతో గొప్పది. ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు.**" నీకు సహజంగా ఉన్న కన్నును పెరికివేయమని యేసు చెప్పుటలేదు.

నీ కన్ను నీ మనసుకు కిటికీలాంటిది అని మరియు నీ కళ్ళు శరీరాశకు కారణమవుతాయి అని ఆయన చెప్తున్నాడు. మొదట నీవు చూస్తావు; తరువాత నీవు చూసినదానిని బట్టి దురాశ నీలో మొదలౌతుంది; తరువాత దానిని క్రియారూపంలో పెట్టి పాపము చేస్తావు. మరొక మాటలో చెప్పాలంటే, నీవు నీ కన్ను ద్వారా చూసిన విషయాలను గురించి నీ మనసులో ఆలోచనలు వస్తాయి, ఆ ఆలోచనలను బట్టి నీవు పాపము చేయడానికి అవకాశముంటుంది కాబట్టి నీ మనసులో వచ్చిన ( ఆ ఆలోచనలను, ఆలోచనా విధానాన్ని) పెరికివేయాలి అని ప్రభువు చెప్తున్నాడు. నీవు గనుక వాటిని తీసి పారవేయకుండ వాటితో కలిసి పనిచేసినట్లయితే నరకానికి వెళ్ళవలసి ఉంటుంది అని ప్రభువు చెప్పుచున్నాడు. నేను ఏమి చెప్తున్నానో మీకు అర్థం అయ్యిందా?

మత్తయి సువార్త 6:6 లో ప్రభువు ఈ విధంగా చెప్పియున్నాడు, **" నీవు ప్రార్ధన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్ళి తలుపు వేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్ధన చేయుము; అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును."** అనగా నీవు ప్రార్ధన చేయడానికి వెళ్ళినప్పుడు నీ మనసు యొక్క తలుపులు మూసివేయాలి అని అర్థం. నీ చుట్టూ ఉన్న విషయాలమీద, వస్తువులమీద నీ మనసును తీసివేసి దేవుని స్వరము వినడానికి నీ మనసును అప్పగించాలి. దేవుని ఆత్మ ద్వారా దేవుని వాక్యాన్ని మనం అర్ధం చేసుకోవడానికి దేవుడు కొన్నిసార్లు కొన్ని ఉదాహరణలను ఉపయోగిస్తాడు.

మార్కు సువార్త 6 వ అధ్యాయంలో యేసుక్రీస్తు వారు చెప్తున్న కన్ను విషయానికి వద్దాం. ఆయన చెప్తున్నాడు, నీ మనసులో పాపాన్ని చేయడానికి ప్రేరేపించే ఆలోచనలను నీవు తీసిపారవేయకపోయినట్లయితే దేవుని రాజ్యానికి వెళ్ళలేవు. అనగా దేవుని సమాధానములోనికి లేదా ఆనందంలోనికి ప్రవేశించలేవు. ఆయన విశ్రాంతిలో నీవు నిలువలేవు. నీ మనసులో నెమ్మది లేని పరిస్థితులను అనుభవించడానికి కారణము ఇదే. నీ మనసులో శాంతి ఉండదు, సమాధానము ఉండదు, ఆనందం ఉండదు, ఇదే నరకముగా చెప్పబడుతుంది. మార్కు 9:48 యాంప్లిఫైడ్ బైబిలులో ఈ విధంగా ఉంది, **" నరకమున పురుగు చావదు ( మనిషి తనకు తాను చేసుకున్న పావము వలన యేర్పడిన గాయాలకు గుర్తుగా ఉంది) అగ్ని ఆరదు."**

ఈ పురుగు అనేది శారీరక మనసు అని ప్రభువు నాకు తెలియచేశాడు. శారీరక మనసు అనేది పంచేంద్రియాలను అనుసరించి శారీరక ఆశలను నెరవేర్చుకుంటుంది. **"నరకమున పురుగు చావదు( మనిషి తనకు తాను చేసుకున్న పావము వలన యేర్పడిన గాయాలకు గుర్తుగా ఉంది) అగ్ని ఆరదు"**.... మరొక మాటలో అతని పాపములే అతని సరిచేస్తాయి! యిర్మియా 2:19 ఇదే విషయాన్ని చెప్తుంది, "**నీ దేవుడైన యెహోవాను విసర్జించుటయు, నీకు నా యెడల భయభక్తులు లేకుండుటయు, బాధకును శ్రమకును కారణమగునని నీవు తెలిసికొని గ్రహించునట్లు నీ చెడుతనము నిన్ను శిక్షించును, నీవు చేసిన ద్రోహము నిన్ను గద్దించునని ప్రభువును సైన్యముల కధిపతియునగు యెహోవా సెలవిచ్చుచున్నాడు."** ఈ రెండు వచనాలలో కూడా వారి చెడుతనము వారిని బాధిస్తుంది, వారి చెడుతనము వారిని శిక్షిస్తుంది అని ఉంది! ఇది నిజము!

మార్కు సువార్త 9: 48 ఈ విధంగా చెప్తుంది, "...**నరకమున వారి పురుగు చావదు."** శరీరాశ కలిగి ప్రవర్తించే వారిని గురించి ఇది తెలియచేస్తుంది. చాలా మంది సేవకులు దీనితో ఏకీభవించుట లేదు కాని ఈ శరీర సంబంధమైన మనసుతోనే పనిచేస్తున్నారు అనే విషయాన్ని దేవుడు నాకు బయలుపరచియున్నాడు. ఒక వ్యక్తి చనిపోయిన తరువాత అతని ఆత్మ

జీవిస్తుంది. దీనికి ఉదాహరణ చెప్తాను, లాజరు గురించి మీకు గుర్తుందా? లూకా సువార్త 16: 19 లో ఈ విధంగా ఉంది. **“ధనంతుడొకడుండెను. అతడు ఊదారంగు బట్టలును సన్నపు నార వస్త్రములును ధరించుకొని ప్రతిదినము బహుగా సుఖపడుచుండువాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. వాడు కురుపులతో నిండినవాడై ధనవంతుని యింటి వాకిట పడియుండి అతని బల్లమీద నుండి పడు రొట్టెము క్కలతో ఆకలి తీర్చుకొనగోరెను; అంతేకాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతలచేత అబ్రాహాము రొమ్మున (ఆనుకొనుటకు) కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున (ఆనుకొనియున్న) లాజరును చూచి -తండ్రివైన అబ్రాహామా, నాయందు కనికరపడి, తన వ్రేలికొనను నీళ్ళలోముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము; నేను ఈ అగ్ని జ్వాలలో యాతనపడు చున్నానని కేకలువేసి చెప్పెను. అందుకు అబ్రాహాము - కుమారుడా, నీవు నీ జీవతకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము; ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతన పడుచున్నావు. అంతేకాక ఇక్కడనుండి మీ యొద్దకు దాట గోరువారు దాటి పోజాలకుండునట్లును, మాకును మీకును మధ్య మహా అగాధముంచబడియున్నదని చెప్పెను. అప్పుడతడు- తండ్రీ, ఆలాగైతే నా కయిదుగురు సహోదరులున్నారు. వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్షమిచ్చుటకై నాతండ్రియింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను. అందుకు అబ్రాహాము- వారియొద్ద మోషేయు ప్రవక్తలు ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనితో చెప్పగా అతడు - తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతుల లోనుండి ఒకడు వారి యొద్దకు వెళ్లిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను. అందుకతడు - మోషేయు ప్రవక్తలును (చెప్పిమాటలు) వారు విననియెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెననెను.”** లాజరు చాలా పేదవాడు కాని అబ్రాహాము రొమ్మున అనుకొని యున్నాడు. ధనవంతుడు ఊదారంగు బట్టలను, సన్నపునారబట్టలును ధరించు కున్నాడు, ఊదా రంగు బట్టలు యాజకులు ధరిస్తారు కాబట్టి అతడు యాజకుడు. కాని అతడు చనిపోయి పాతాళమునకు కొనిపోబడ్డాడు. అతడు బాధించబడ్డాడు అంతే కాకుండా వాక్యము చెప్తుంది అతడు కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును చూశాడు అనగా తను ఎక్కడ ఉండి మొర్ర పెడుతున్నాడో ఆ స్థితిని తెలుసుకుని అబ్రాహామును వేడుకొంటున్నాడు. అబ్రాహాము రొమ్మున ఉన్న లాజరును చూచి తన నాలుకను చల్లార్చుటకు ఒక చుక్క నీళ్లను లాజరుతో పంపించమని అడుగుతున్నాడు. అంతేకాదు ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండా దేవుని మాటకు వారు విధేయులగుట్లుగా లాజరును అతని తండ్రి యింటికి పంపించమని కోరుతున్నాడు. నీవు ఆ స్థలానికి వెళ్లాలని ఆశించవు! అక్కడ ధనవంతునికి లాజరుకు మధ్య మహా అగాధముంది.

నీవు దేవుని ప్రేమిస్తూ, దేవుని ఆత్మలో నడుస్తున్నప్పుడు, నీ చుట్టు ఉన్న ప్రజలు పాపములో, లోకములో ఉన్నప్పుడు వారికి నీకు మధ్య మహా అగాధము ఉంది అనే విషయాన్ని నీవు

ఎప్పుడైనా గ్రహించావా? వారి మనసులో నరకము ఉంది. అదే మహా అగాధము! లూకా 16:19-31 వచనాలు మంచి ఉదాహరణగా తీసుకుని దేవుడు మనకు బోధిస్తున్నాడు. దేవుడు మనిషిని "మ్రాను" అని కూడా పిలుస్తున్నాడు ప్రసంగి 11:3 "**మ్రాను దక్షిణముగా పడినను ఉత్తరముగా పడినను అది పడిన చోటనే యుండును''**. సమస్యలలో ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే అది అంతమవుతుంది అని తలుస్తాడు. కాని అది కాదు. ఆత్మ, మనసు ఉంటాయి. శరీరములో ఉన్నప్పుడు బాధననుభవించినట్లుగానే చని పోయిన తరువాత కూడా మానసిక, భావోద్రేక ఒత్తిడులు ఉంటాయి. ఇక్కడ తేడా ఏమిటంటే భౌతికమైన శరీరం మాత్రమే లేదు. నేను ఏమి చెప్తున్నానో మీరు వింటున్నారా?

మార్కు 9:49 కి తిరిగి వెళ్లినట్లయితే యాంప్లిఫైడ్ బైబిలులో ఇలా ఉంది **''ప్రతి వానికి ఉప్పుసారము అగ్ని వలన కలుగును''....** ఓ, నాకు పెద్దగా అరవాలని ఉంది! ప్రతి ఒక్కరూ భద్రపరచబడతారు! నీవు అది చూస్తావా? ప్రతి ఒక్కరిమీద అగ్ని ఉంచబడాలి. నరకము గుండా వారు వెళ్లవలసిఉంది. నరకము అనగా ఏమిటి? నరకము అనగా అగ్నియా? ఆ అగ్ని ఏమిటి? దేవుడే! హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 12: 29 ఈ విధంగా చెప్తుంది, "**యేలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు''.** ద్వితీయోపదేశకాండము 4:24 లో ఈ విధంగా ఉంది, **''యేలయనగా నీ దేవుడైన యెహోవా దహించు అగ్నియు రోషముగల దేవుడునై యున్నాడు''.**

దావీదు కీర్తనలు 139:7,8 వచనాలలో ఈ విధంగా వ్రాస్తున్నాడు, "**నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమునకెక్కినను నీవు అక్కడను ఉన్నావు నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు''.** దేవుడు ప్రతిచోటను ఉన్నాడు! శుద్ధి చేయుటకు, బాగు చేయుటకు ప్రతి కాలములోను ఆయన ఏకరీతిగా ఉన్నాడు.

1 పేతురు3:18-20 వచనాలలో ఈ విధంగా ఉంది, "**యేలయనగా మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు, ఆత్మ విషయములో బ్రతికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి''.** నోవహు కాలములో చనిపోయిన వారందరికి క్రీస్తు పునరుత్థానుడై లేచిన తరువాత క్రీస్తును అంగీకరించుటకు అవకాశము ఇవ్వబడింది, అయితే కొంతమంది అంగీకరించలేదు. అలాంటి వారిమీద మరి యెక్కువ భద్రత ఉంచబడింది, మరొక సమయము వరకు వారిని చెరసాలలో భద్రపరచాడు. కాని అదే వర్తమానముతో ఆయన తిరిగి వారి దగ్గరికి వస్తాడు అని నీవు తలంచుచున్నావా? "ఇప్పుడు నీవు సిద్ధముగా ఉన్నావా? చెరసాలనుండి బయటకు రావడానికి ఇష్టపడు తున్నావా? మీరు వెయ్యి సంవత్సరాలైనా, రెండు వేల సంవత్సరాలైనా, నాలుగు వేలు సంవత్సరాలైనా నోవహు దినములలో చనిపోయిన వారివలె మీరు పాపము చేత బంధించబడినట్లయితే ఆయన ఒక రోజు వచ్చి ఇప్పుడైనా "మీరు మీ నరకములోనుండి బయటకు రండి, నేను మీకు విశ్రాంతినిస్తాను'' అని ఆయన చెప్తాడు. బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నారా?

నేను బాప్టిస్టుగా ఉన్నప్పుడు నా మదిలో ఒక ప్రశ్న ఉండేది, అందువలన నేను ఇలా ప్రార్థించాను," యేసు, నీవు

ప్రేమ కలిగిన దేవుడవైతే చిన్న పిల్లలను నిత్య నరకములో ఎలా ఉంచగలవు?'' ఆ సమయంలో ఒక యాక్సిడెంట్‌లో చనిపోయిన 8 సంవత్సరాల పిల్లవాని గురించి నేను ఆలోచిస్తున్నాను. "దేవా ఏ విధంగా ఆ బిడ్డను చేయబోతున్నావు? తల్లి గర్భములో ఉండగానే గర్భస్రావము ద్వారా చంపబడుతున్న పిల్లలను గురించి నేను గుర్తు చేసుకున్నాను. వారు నిత్య నరకములోనికి వెళ్లబో తున్నారా?

"నిత్యత్వము'' అనే మాటను గురించి గ్రీకు, హీబ్రూ భాషలో అధ్యయనం చేసినట్లయితే "యుగయుగాలు '' అని తెలుసు కోగలము. దేవునియందు చాలా యుగములు, ప్రపంచములు ఉన్నాయి. ప్రతి విషయము దేవుని నుండి వచ్చి, దేవుని ద్వారా నడిపించబడి, దేవుని యొద్దకు తిరిగి చేరుతుంది. రోమా పత్రిక 11:36 లో ఈ విధంగా ఉంది, **"ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగయుగముల వరకు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమెన్''.** "ఆయన ద్వారా'' అనేది శుద్ధి చేసే సమయము. ఆయన మనలో మార్పు తేవడానికి కొన్ని కష్టమైన పరిస్థితుల గుండా మనలను నడిపిస్తాడు. ఆ సమయంలోనే మనజీవితాలలో మనము నరకాన్ని అనుభవిస్తాము.

మార్కు సువార్త 9:50 యాంప్లిఫైడ్ బైబిలులో ఈ విధంగా ఉంది, **"ఉప్పు మంచిదే గాని (ఉపయోగకరమైనది) ఉప్పు నిస్సారమైన యెడల దేనివలన మీరు దానికి సారము కలుగజేతురు?(ఉప్పుగా) మీలో మీరు ఉప్పు సారము గలవారై యుండి యొకరితో ఒకరు సమాధానముగా ఉండుడని చెప్పెను''.** మరొక మాటలో చెప్పాలంటే నీవు నేను అన్ని వేళల్లోను "ఉప్పు'' వేసినవారముగా ఉండాలి. ఎలా? నీ జీవితంలోని ప్రతి ఏరియా ఆయన అగ్ని చేత దహించబడి క్రీస్తు స్వారూప్యంలోనికి మార్చబడి ఆయనతో ఐఖ్యమై ఉండాలి అనే విషయాన్ని నీవు అర్థం చేసుకోవాలి. ఈ విధంగా నీవు మార్చబడినప్పుడు నీవు ఉప్పు వలె సారము కలిగి ఉంటావు. నేను ఏమి చెప్తున్నానో మీకు అర్థం అవుతుందా? నీవు క్రీస్తు స్వారూప్యంలోనికి మార్చబడినప్పుడు నీ చుట్టూ ఉన్నవారికి నీవు ఒక్క మాట కూడా చెప్పవలసిన అవసరం లేకుండానే వారు ఆకర్షించబడతారు, ఎందుకంటే నీలో ప్రభువు ఉన్నాడు, ప్రభువుతో నీవు ఐఖ్యమై ఉన్నావు, ప్రభువు సన్నిధి నీయొద్ద ఉన్నది.

చాలాకాలం క్రితం ( నేను ఈ వాక్యమును గురించి తెలుసుకొనే ముందు), నేను ఒకరి ఇంటికి నడిచి వెళుతున్నప్పుడు దేవుడు ఇలా చెప్పియున్నాడు, " నీవు ఈ ఇంటిలోనికి నడుస్తున్నావు గనుక ఇది పరిశుద్ధ స్థలముగా మార్చబడుతుంది'' , నేను ప్రభువును అడిగాను "దేవా, దీని అర్థము ఏమిటి''. ప్రభువు అన్నాడు, ''నేను నీలో నివసించడం లేదా?, నీతో నేను నడవడం లేదా? నేను నీతోపాటు ఈ స్థలములో నడుస్తూ ఉన్నాను, వారిని నా ప్రజలుగా చేయ బోతున్నాను. నేను వారిని లేవనెత్తే వరకు వారు భద్రపరచబడతారు.

దేవుడు లేవనెత్తకుండా ఎవ్వరూ లేవలేరు. దేవుడు ఒక ప్రత్యేకమైన సమయంలో వారిని ఆయన యొద్దకు తీసుకువస్తాడు. అలా ఆ ప్రత్యేకమైన సమయంలో ఆయన యొద్దకు రాని వారిని తిరిగి ఆయనతో సంబంధము ఏర్పరచుకొనే వరకు వారిని ఆయన భద్రపరుస్తాడు. ఇది చాలా సులువైనది. దేవునితో నీ సంబంధము ఎలాంటిది.

\- - - - - - - - - - - -